www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025 | Srikakulam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | శ్రీకాకుళం

నేటి నుంచి వేసవి సెలవులు



రెడ్డికపేటలో విద్యార్థుల సందడి

నరసన్నపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12 నుంచి పాఠశాలలు తెరచుకోనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో 3,256 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 3.6లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల్లో సందడి నెలకొంది. మేలో ఉపాధ్యాయుల బదిలీ చేపట్టి, జూన్ మొదటి వారానికి ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు పేరిట ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే.. చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేసింది.

‘పది’లో 14వ స్థానం

- 23,219 మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఈసారీ బాలికలదే పైచేయి
- ఓపెన్ టెన్త్‌లో 19 శాతమే పాస్
- ఓపెన్ ఇంటర్‌లో 18వ స్థానానికే పరిమితం



పరీక్ష రాస్తున్న పదోతరగతి విద్యార్థులు (ఫైల్)

శ్రీకాకుళం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 14వ స్థానం లభించింది. ఎప్పటిలానే ఈ సారీ బాలురు కన్నా బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు 28,176మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 14,287మంది బాలురు, 13,889 మంది బాలికలు ఉన్నారు. బుధవారం ఫలితాలు విడుదల కాగా.. జిల్లాలో 23,219మంది ఉత్తీర్ణత సాధించారు. 11,358 మంది(79.50 శాతం) బాలురు, 11,861 మంది(85.40 శాతం) బాలికలు పాసయ్యారు. మొత్తం 82.41శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాలో 19,114 మంది విద్యార్థులు ప్రథమశ్రేణి(ఫస్ట్ క్లాస్)లో పాసయ్యారు. 2,885 మంది సెకెండ్ క్లాస్‌లోనూ, 1,220 మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు.

ఓపెన్ టెన్త్‌లో కేవలం 9.46 శాతమే పాస్...

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లా వెనుకంజలో నిలిచింది. ఓపెన్ టెన్త్ విషయానికొస్తే.. కేవలం 9.46 శాతం మాత్రమే ఉత్తీర్ణత లభించింది. 708 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 67 మంది మాత్రమే పాసయ్యారు. 286 మంది బాలురు పరీక్ష రాయగా 25 మంది ఉత్తీర్ణులయ్యారు. 422 మంది బాలికలు పరీక్ష రాయగా 42 మంది మాత్రమే పాసయ్యారు. ఎక్కువ మంది విద్యార్థులు హిందీ, గణితం, సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షలలో తప్పారు. రాష్ట్రస్థాయిలో ఓపెన్ టెన్త్‌లో జిల్లాకు 19వ స్థానం దక్కింది.

ఓపెన్ ఇంటర్‌లో 35.57 శాతం ఉత్తీర్ణత...

ఓపెన్ ఇంటర్‌లో 35.57 శాతం ఉత్తీర్ణత లభించింది. 727 మంది బాలురు, 701 మంది బాలికలు.. మొత్తం 1,428 పరీక్ష రాశారు. ఇందులో 213 మంది బాలురు, 295 మంది బాలికలు.. మొత్తం 508మంది పాసయ్యారు. బాలురుల్లో 29.30 శాతం ఉత్తీర్ణత, బాలికల్లో 42.08 శాతం ఉత్తీర్ణత లభించింది. రాష్ట్రస్థాయిలో ఓపెన్ ఇంటర్మీడియట్‌లో 18వ స్థానం దక్కింది.

కుప్పిలి కేంద్రంలో తగ్గిన ఉత్తీర్ణత ● 8శాతానికి పడిపోయిన వైనం 2లో

ఆటోడ్రైవర్ కుమారుడి ప్రతిభ



తేజకు అభినందనలు తెలియజేస్తున్న తల్లిదండ్రులు

టెక్కలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాలతలగాం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ జగదీష్ కుమారుడు సనపల తేజ పదోతరగతిలో 595 మార్కులతో ప్రతిభ చూపాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. గ్రామస్థులు అభినందనలు తెలిపారు. అలాగే బీంపురం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

జ్యోషిత.. ఘనత

హరిపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల గ్రామానికి చెందిన కంచరాన జ్యోషిత పదోతరగతిలో 597 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు కంచరాన మాధవరావు పెద్దకేసుపురం పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు కాగా, తల్లి లేపాక్షి సోంపేట మండలం తాళ్లపద్రలో ఎస్‌జీటీ ఉపాధ్యాయరాలు. ప్రభుత్వ పాఠశాలలపై మక్కువతో తమ కుమార్తె జ్యోషితను హరిపురం హైస్కూల్‌లో చదివించామని తల్లిదండ్రులు తెలిపారు. హరిపురం పాఠశాల హెచ్‌ఎం ఉమారాజ్‌తోపాటు మఖరజోల గ్రామస్థులు జ్యోషితకు అభినందనలు తెలియజేశారు.



జ్యోషిత

పకడ్బందీగా సిరిమానోత్సవం

- డీఆర్వో వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ‘శ్రీకాకుళంలోని గ్రామదేవతల సిరిమానోత్సవాలను అన్నిశాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలి. అధికారులంతా ఉత్సవ ఏర్పాట్లపై దృష్టి సారించాల’ని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు ఆదేశించారు. పాత శ్రీకాకుళంలోని ముత్యాలమ్మ, నక్కవీధిలోని నూకాలమ్మ, సంతోషిమాత జంక్షన్ వద్ద దుర్గమ్మ, మావూరు వీధిలోని పెద్దమ్మతల్లి, కొత్తపేట వద్ద సన్నాల పోలమ్మ పండుగలు మే 6 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 10న సిరిమానుల అనుపు ఉత్సవంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో సిరిమానోత్సవ ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో డీఆర్వో సమావేశమయ్యారు. ‘మంచి వాతావరణంలో పండుగలు నిర్వహించాలి. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి’ అని డీఆర్వో తెలిపారు. దీనిపై మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్ మాట్లాడుతూ పదేళ్లకోసారి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాపరిషత్ నుంచి దేశల్ల వీధి, నక్కవీధి, దండివీధి, సంతోషిమాత జంక్షన్, మావూరు వీధి, కలెక్టర్ బంగ్లా, హరిజనవీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేట, కుందనపుపేట మీదుగా సిరిమానోత్సవం ఉంటుదన్నారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, తహసీల్దార్ గణపతిరావు, నీటిపారుదల, రెవెన్యూ, దేవదాయశాఖ, వైద్యారోగ్యశాఖ, పోలీసు శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఉగ్రదాడి.. పిరికిపంద చర్య

- దాడిచేసిన వారిని వదిలే ప్రసక్తి లేదు
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- శ్రీకాకుళంలో కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన

అరసవల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ‘కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో మంగళవారం పర్యాటకులపై హఠాత్తుగా చేసిన ఉగ్రదాడి.. ఒక పిరికిపంద చర్య. దాడికి పాల్పడినవారిని వదిలే ప్రసక్తి లేదు’ అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా బుధవారం రాత్రి శ్రీకాకుళంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళి అర్పించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ‘ఉగ్రదాడి ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చాలా సీరియస్‌గా ఉన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ దాడిచేసిన నిందితులను వదిలేది లేదు. శ్రీనగర్ నుంచి మొత్తం 4,500మంది ప్రయాణికులను ఇళ్లకు క్షేమంగా చేర్చేందుకు 35 విమానాలను ఏర్పాటు చేశాం. ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకున్నాం. ఈ దాడిలో రాష్ట్రానికి చెందిన మధుసూదన్, జిల్లాకు చెందిన చంద్రమౌళి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమ’ని (మిగతా 2వ పేజీలో..)



చంద్రమౌళి (ఫైల్)

ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి సిక్కోలు వాసే

శ్రీకాకుళం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడి మృతుల్లో ఒకరైన జరజాపు సత్యచంద్రమౌళి(68) శ్రీకాకుళం జిల్లా వాసే. ఈయన కుటుంబం శ్రీకాకుళంలోని ఇందిరా నగర్ కాలనీలోనే ఉంది. సత్యచంద్రమౌళికి భార్య నాగమణి, కుమార్తెలు నిహారిక, అనిమిషతోపాటు ఇద్దరు సోదరులు ఉన్నారు. స్టేట్‌బ్యాంకులో ఉద్యోగం సాధించాక విజయనగరంతోపాటు.. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తూ.. బ్రాంచ్ మేనేజర్‌గా ప్రమోషన్ పొంది కొన్నాళ్ల కిందట రిటైర్డ్ అయ్యారు. చాన్నాళ్ల కిందట విశాఖపట్నంలోనే స్థిర నివాసం ఏర్పాటుచేసుకున్నారు. కుమార్తెలిద్దరికీ వివాహమై.. వాళ్లు యూఎస్‌ఏలో స్థిరపడ్డారు. బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల మూడు కుటుంబాలు కశ్మీర్ పర్యటనకు ఈ నెల 18న వెళ్లారు. పహల్గాంలో మంగళవారం ఉగ్రవాదుల దాడిలో సత్యచంద్రమౌళి మృతి చెందారు. దీంతో సిక్కోలులో విషాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళంలో నివసిస్తున్న పెద్దన్నయ్య జరజాపు ప్రకాశరావు(రిటైర్డ్ యూనియన్ బ్యాంకు మేనేజర్) హుటాహుటిన విశాఖపట్నం వెళ్లారు. చంద్రమౌళి భౌతికదేహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి నివాళి అర్పించారు. యూఎస్‌ఏ నుంచి కుమార్తెలు గురువారం వచ్చాక అంత్యక్రియలు నిర్వహిస్తారు. తన సోదరుడు పుట్టి పెరిగింది శ్రీకాకుళంలోనేనని.. ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో స్థిరపడ్డారని.. ఈ ఘటనతో మమ్మల్ని ఎంతగానో కలచివేసిందని ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో సత్యచంద్రమౌళితో పరిచయం ఉన్నవాళ్లందరూ విషాదంలో మునిగిపోయారు.

త్వరలో కొత్త పింఛన్లు

- జూలై నుంచి పంపిణీకి కసరత్తు
- జిల్లాలో వేలాదిమందికి లబ్ధి





మెళియాపుట్టి ఎంపీడీవో కార్యాలయం

- మెళియాపుట్టి మండలం మర్రిపాడు (సి) గ్రామానికి చెందిన మల్లిపురం అప్పల నరసమ్మ భర్త భయ్యలు 2023 డిసెంబర్‌లో మృతి చెందాడు. ఆమె వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసినా గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో కుటుంబ పోషణ భారమవుతోందని ఆమె వాపోతోంది.
- మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురానికి చెందిన సిద్దల భారతికి భర్త చనిపోయి ఏడాది గడుస్తున్నా వితంతువు పింఛన్ రాలేదు. ఇంటి పెద్ద దిక్కులేక ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది.
- మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురానికి చెందిన సావిత్రిపాత్రో భర్త ఏడాదిన్నర కిందట కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఆమె వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా, మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతోంది. కూలికి వెళ్తే తప్ప పూట గడవని పరిస్థితి నెలకొందని వాపోతోంది. అలాగే ఇదే గ్రామానికి చెందిన ధనలక్ష్మి పాత్రో భర్త కూడా చనిపోయి ఆరు నెలలు అవుతోంది. ఆమె కూడా వితంతువు పింఛన్ మంజూరు కోసం ఎదురు చూస్తోంది.



సావిత్రి పాత్రో



ధనలక్ష్మి పాత్రో

- ఇటువంటి వారందరికీ ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు రంగం సిద్ధం చేస్తోంది. పాత దరఖాస్తులను సైతం పరిశీలించి.. జూలై నుంచి కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో చాలామందికి ప్రయోజనం దక్కే అవకాశం కనిపిస్తోంది.

మెళియాపుట్టి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం జూలైలో కొత్త పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించింది. త్వరలో విధివిధానాలు ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో 3,47,798 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.83.72 కోట్లు పంపిణీ చేస్తోంది. ఏడాదిన్నర నుంచి కొత్త పింఛన్లు మంజూరుకాలేదు. దీంతో ప్రతి మండలం నుంచి 100 నుంచి 150 వరకు దరఖాస్తులు రానున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 10వేల మందికిపైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సుమారు 5వేల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. ఈ భారమంతా ప్రస్తుత ప్రభుత్వంపై పడనుంది. ప్రతినెలా సుమారు మరో రూ.40కోట్ల వరకు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

అధికంగా బోగస్..

వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా అధికంగా బోగస్ పింఛన్లు మంజూరు చేసిందనే విమర్శలున్నాయి. వైసీపీ నేతల కుటుంబ సభ్యులకే ఎక్కువగా పింఛన్లు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ దివ్యాంగ సర్టిఫికెట్లతో చాలా మంది లబ్ధి పొందారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేస్తోంది. దివ్యాంగ పింఛన్‌దారుల సదరం (మిగతా 2వ పేజీలో..)

డీఐఈవోగా సురేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



గుజరాతీపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈవో)గా రేగ సురేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ అదనపు బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.తవిటినాయుడు విజయ నగరం జిల్లాకు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సురేష్ కుమార్‌ను ఇటీవల జిల్లా రెగ్యులర్ డీఐఈవోగా పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈయన 1992లో సర్వీస్ కమిషన్ ద్వారా కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా వృత్తిజీవితం ప్రారంభించారు. చినమేరంగి, గుమ్మలక్ష్మీపురం, గజపతినగరం మండలాల్లో పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ఎస్.కోట, గుమ్మలక్ష్మీపురం, గుర్ల కళాశాలల్లో పనిచేశారు. బుధవారం డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆర్ఐవో దుర్గారావు, ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు, వర్మ, నాగేంద్ర శర్మ, గణపతి వెంకటేశ్వరరావు, కీర్తి తవిటినాయుడు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రతినిధులు కరణం నర్సింగరావు, ఎస్వీ సత్యనారాయణ అభినందించారు.

శిలాఫలకమే మిగిలింది

- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

3లో

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఇసుక లారీ

- తెగిపడిన తీగలు.. చెలరేగిన మంటలు

2లో

ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అనేక మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్నారు. వీరిలో ఎక్కువ మంది 590కి పైగా మార్కులు సాధించడం గమనార్హం. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి.

పదిలో మెరిశారు

● ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి మార్కులు

ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఫలితాలు


జ్యోత్స్న

మెళియాపుట్టి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండలంలో గల ప్రభుత్వ పాఠశాలలు శతశాతం విజయం సాధించాయి. స్థానిక కేజీబీవీలో 33 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందరూ ఉత్తీర్ణులయ్యారు. నేలబొంతు, భరణికోట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులైనట్టు మండల విద్యాశాఖ అధికారులు దేవేంద్రరావు, పద్మనాభం తెలిపారు. కొసమాల పాఠశాల విద్యార్థిని నీలపు జ్యోత్స్న 591 మార్కులు సాధించింది.

నందిగాం మండలంలో...


అనుష్క


జశ్వంత్‌సాయి

నందిగాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కణితివూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని గిన్ని అనుష్క 588 మార్కులు సాధించింది. లఖిదాసుపురం ఉన్నత పాఠశాల విద్యార్థి బాలక జశ్వంత్‌సాయి 582, పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి గణేష్‌దత్త 581, నందిగాం ఉన్నత పాఠశాల విద్యార్థిని టేకి చందన 580 మార్కులు సాధించారని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు తెలిపారు. కాపుతెంబూరు ఉన్నత పాఠశాలలో 22మంది పరీక్షలు రాయగా.. శతశాతం ఫలితాలు సాధించారని తెలిపారు.

కోటబొమ్మాళిలో...


కీర్తికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన ఎస్.కీర్తిక 589 మార్కులు సాధించింది. లఖందిడ్డి ప్రభుత్వ పాఠశాలకు చెందిన బి.దివ్య 584, కురుడు పాఠశాలకు చెందిన ఆర్.దుర్గాప్రసాద్ 580 మార్కులు సాధించారు. చిన్నబమ్మిడి పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

పలాసలో..


కొణపల వీణ జ్యోతి నాగవర్షిణి
యామిని దుర్గ టి.మయూరి
బొరిగి గాయత్రి జోగ నిరోషా

పలాస/పలాస రూరల్/కాశీబుగ్గ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాజీ నగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థిని టి.మయూరి పది పరీక్షల్లో 582, బొరిగి గాయత్రి 584 మార్కులు సాధించారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్ విద్యార్థిని జోగ నిరోషా 585 మార్కులు సాధించగా, పి.బాలకృష్ణ 584, చింతాడ హర్షిత 584, బి.హేమంత్ 581 మార్కులు సాధించారు. చిన్నబడాం విద్యార్థిని ఎం.యామినీదుర్గ 581, కాశీబుగ్గ విద్యార్థిని కె.వీణ 587 మార్కులు సాధించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్‌కుమార్ పండా 584 మార్కులు, సప్ప విక్రాంత్ 581, కార్తికేయ 581 మార్కులు సాధించారు. చినబడాం హైస్కూల్‌కు చెందిన చుక్కాల జ్యోతినాగవర్షిణి 581 మార్కులు సాధించారు.


చింతాడ హర్షిత

పాతపట్నంలో...


మనోహర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది


కుంచి కీర్తన ముద్దాడ అపర్ణ

పాతపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 75 మంది పదో తరతగి పరీక్షలు రాయగా... అందరూ ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో తిరుమలరావు తెలిపారు. రొంపివలస జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి జోల మనోహర్ 593 మార్కులు సాధించాడని హెచ్‌ఎం ఎన్.కుమారస్వామి తెలిపారు. డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలి కల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కుంచి కీర్తన-587, ముద్దాడ అపర్ణ- 581 మార్కులు సాధించారు.

నరసన్నపేటలో...


పి.కుశాల్


శ్యామలను అభినందిస్తున్న సిబ్బంది


సప్ప ప్రవీణ్ కె.మణి

నరసన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులానికి చెందిన పి.కుశాల్ 593 మార్కులు సాధించారు. మాకివలస ఉన్నత పాఠశాల విద్యార్థిని నేతింటి శ్యామల 590, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సప్ప ప్రవీణ్ 587, బోర్డు ఉన్నత పాఠశాలకు చెందిన కె.మణి 580 మార్కులు సాధించారు.

హిరమండలంలో...


పి.షర్మిలపూజిత బెజ్జిపల్లి దిలీప్

హిరమండలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.షర్మిల పూజిత 582, తంప జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బెజ్జిపల్లి దిలీప్ 580 మార్కులు సాధించారు.

పోలాకిలో...


రుంకు సుస్మిత

పోలాకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థిని రుంకు సుస్మిత 586 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు.

కొత్తూరులో...


బర్రి హరిణి బోడసింగి వంశీ

కొత్తూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బర్రి హరిణి 591 మార్కులు సాధించింది. నివగాం జెడ్పీ హైస్కూల్ విద్యారి బోడసింగి వంశీ 580 మార్కులు సాధించాడు.

మందసలో..


పైల కీర్తన కొండపల్లి దీపిక

హరిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హరిపురం హైస్కూల్ విద్యార్థిని కె.జ్యోషిత 597, కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పైల కీర్తన 590, సిరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొండపల్లి దీపిక 590 మార్కులు సాధించారు. మందస జెడ్పీ స్కూల్‌కు చెందిన సంజనా బెహరా 588 మార్కులు, సాధించారు.

వజ్రపుకొత్తూరులో...


అఖిల్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాతటెక్కలి హైస్కూల్ విద్యార్థి ఎల్.అఖిల్ 589 మార్కులు సాధించాడని ఎంఈఓ వెంకటేశ్వరరావు చెప్పారు.

సారవకోటలో..


కొల్లి శ్రీలత యువశ్రీ

జలుమూరు (సారవకోట), ఏప్రిల్ 23: (ఆంధ్రజ్యోతి): అలుదు ఉన్నత పాఠశాలకు చెందిన కొల్లి శ్రీలత 586 మార్కులు సాధించింది. చిన్నకిట్టాలపాడుకు చెందిన యువశ్రీ 581 మార్కులు సాధించింది.

కవిటిలో...


అభిజిత్‌ను అభినందిస్తున్న ఎంఈఓ


బి.పవిత్ర హత్తి ఉదిత్

కవిటి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపేటకు చెందిన జె.అభిజిత్, సహలాల పుట్టుగలోని ఒడియా మాధ్యమానికి చెందిన హత్తి ఉదిత్ 587 చొప్పున మార్కులు సాధించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బి.పవిత్ర 584 మార్కులు సాధించింది. కొత్తకొజ్జిరియాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా వారంతా ఉత్తీర్ణత సాధించి... శతశాతం నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇచ్ఛాపురంలో..


అంజలి బెహరా


మౌనిక యామిని

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈదుపురం జడ్‌పీహెచ్ఎస్ విద్యార్థిని అంజలి బెహరా 589 మార్కులు సాధించింది. ఎంపీఎల్ జీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని మేరుగు మౌనిక 588 మార్కులు సాధించింది. పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన కదంబాల యామిని 581 మార్కులు సాధించిది.

రణస్థలంలో...


గొర్లె ఝాన్సీ లెంక దీపిక
కరిమజ్జి శ్రుతకీర్తి స్వర్ణరీతిక

రణస్థలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రణస్థలం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 93 మంది పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. గొర్లె ఝాన్సీ 590 మార్కులు, లెంక దీపిక 588, కరిమజ్జి శ్రుతకీర్తి 580, ముద్దాడ స్వర్ణరీతిక 580 మార్కులు సాధించారు.

గారలో...


దున్న ఉమాశ్రీ

గార, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వమరవెల్లి ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థిని దున్న ఉమాశ్రీ 590 మార్కులు సాధించింది. బి.వసంత 587, వెలమల చాందిని, టి.కుసుమ 584 వంతున మార్కులు సాధించారు.

ఎచ్చెర్లలో..


గొంటి జితేంద్ర ఎ.విష్ణువర్ధన్
పైడి కీర్తిక నక్క షర్మిల

ఎచ్చెర్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎం పురంలోని ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన గొంటి జితేంద్రకు 590 మార్కులు వచ్చాయి. ఎ.విష్ణువర్ధన్ 583, పొన్నాడ కేజీబీవీ పాఠశాలకు చెందిన పైడి కీర్తిక 585 మార్కులు, ముద్దాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నక్క షర్మిల 588 మార్కులు సాధించారు.

సరుబుజ్జిలిలో...

సరుబుజ్జిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గోనెపాడు హైస్కూల్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... అందరూ ఉత్తీర్ణులయ్యారు.

సోంపేటలో...


స్రవంతి

సోంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇస్కలపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థిని జి.స్రవంతి 588 సాధించింది. మోడల్ పాఠశాలకు చెందిన కీలు హర్ష 584, మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.ప్రసన్న 583 మార్కులు సాధించారు.

జి.సిగడాంలో...


పూర్ణిమను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్

జి.సిగడాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని సువ్వాడ పూర్ణిమ 590 మార్కు లు సాధించింది. ఆ విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.


ఉదయ్‌కుమార్ వి.సృజన దుర్గాప్రసాద్

బూర్జలో...

బూర్జ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి బి.ఉదయ్‌కుమార్ 593 మార్కులు సాధించాడు. వి.సృజన 590, ఎస్.దుర్గా ప్రసాద్ 586 మార్కులు సాధించారు.

కంచిలిలో...


బపూన్ ప్రధాన్ పూజా బెహరా

కంచిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ఎంఎస్‌పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ముండల పాఠశాల విద్యార్థిని పూజా బెహరా 587 మార్కులు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన పూజా, తల్లిదండ్రులు దినసరి కూలీలు. డీజీపురం ఉన్నత పాఠశాలకు చెందిన బపూన్ ప్రధాన్ ఒడియా మీడియంలో 589 మార్కులు సాధించాడు.

పొందూరులో...


వినీష సాయికిరణ్

పొందూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం. వినీష 585 మార్కులు, పొందూరు పాఠశాల విద్యార్థి పేకల సాయికిరణ్ 583 మార్కులు సాధించారు. కింతలి పాఠశాల విద్యార్థినులు కె.రేణుక 583, కె. షర్మిల 582, పి.జయశ్రీ 580 మార్కులు సాధించారు.

జలుమూరులో...


హేమ శిరీష ఎం.లిఖిత

జలుమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లింగాలవలస ఉన్నత పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా...అందరూ ఉత్తీర్ణులయ్యారు. కరవంజ మోడల్ స్కూలు విద్యార్థిని రావాడ హేమ శిరీష 592 మార్కులు సాధించింది. చల్లవానిపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.లిఖిత 584 మార్కులు సాధించింది.

కుప్పిలి కేంద్రంలో తగ్గిన ఉత్తీర్ణత

● 8 శాతానికి పడిపోయిన వైనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఆదర్శ పాఠశాల కేంద్రంగా జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు బాగా పడిపోయాయి. ఈ కేంద్రంలో ఇంగ్లీషు పరీక్ష జరుగుతున్న రోజున నాలుగు బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేశాయి. ట్రిపుల్ ఐటీ సీటు కోసం చూచిరాతలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలతో డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఈ బృందాలు తనిఖీలు చేశాయి. ఈ తనిఖీల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేయగా, ఇందుకు బాధ్యులుగా పేర్కొంటూ కొంతమంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఉపాధ్యాయ సంఘాల ఆందోళన మేరకు సస్పెన్షన్ కూడా ఎత్తివేశారు.

మరీ దారుణంగా...

కుప్పిలి ఆదర్శ పాఠశాలలో స్థానిక విద్యార్థులతో పాటు బుడగట్లపాలెం, సంతసీతారాంపురం, డి.మత్స్యలేశం, కొయ్యాం, కొచ్చెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కేంద్రంలో పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలు గణనీయంగా పడిపోయాయి. కుప్పిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 51 మంది పరీక్షలు రాయగా... కేవలం నలుగురే ఉత్తీర్ణులై 8 శాతం ఫలితాలు సాధించారు. కుప్పిలి ఆదర్శ పాఠశాలలో 90 మంది విద్యార్థులకు గాను 51 మంది ఉత్తీర్ణులై 57 శాతం ఫలితాలు వచ్చాయి. బుడగట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 34 మంది పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణులయ్యారు. 35 శాతం ఫలితాలు వచ్చాయి. ఎస్ఎస్ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది హాజరుకాగా 14 మంది ఉత్తీర్ణులై 54 శాతం ఫలితాలు వచ్చాయి. కొయ్యాం జడ్పీ ఉన్నత పాఠశాలకు సంబంధించి 100కు 50 మంది ఉత్తీర్ణులై... 50 శాతం ఫలితాలు వచ్చాయి. డి.మత్స్యలేశం పాఠశాలకు సంబంధించి 45 మందికి 15 మంది ఉత్తీర్ణులు కాగా, 33 శాతం ఫలితాలు వచ్చాయి.

త్వరలో కొత్త పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువపత్రాలను మరోసారి పరిశీలిస్తోంది. అలాగే కొంతమంది ఆధార్ కార్డుల్లో వయసు ఎక్కువగా మార్పు చేయించి.. వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టనుంది. అనర్హులను తొలగించి.. అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనుంది. ప్రస్తుతం సచివాలయాల్లో కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మెళియాపుట్టి ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఇసుక లారీ

● తెగిపడిన తీగలు.. చెలరేగిన మంటలు

రణస్థలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలో జాతీయ రహదారి సూర్యా స్కూల్ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఇసుక లారీ ముందు ఉన్న వ్యానును తప్పించే క్రమంలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ లైట్ల స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడడంతో పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. అక్కడ ఉన్నవారు పరుగులు తీశారు. ఎదురుగా వస్తున్న కారుపై విద్యుత్ స్తంభం పడింది. ఆ సమయంలో కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగ లేదు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను జేఆర్‌పురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యుత్ లైన్ తెగిపోవడంతో జేఆర్‌పురం పంచాయతీ పరిధిలో కొన్ని వీధులకు సరఫరా నిలిచిపోయింది.


కారు ముందు భాగంలో పడిన విద్యుత్ స్తంభం


విద్యుత్ స్తంభాన్ని ఢీ కొనడంతో రోడ్డు మధ్యలో పడిన వైర్లు


శ్రీకాకుళంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఉగ్రదాడి.. పిరికిపంద చర్య

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

● **మూల్యం చెల్లించక తప్పదు..**

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. అమాయక పర్యాటకులపై రాక్షసంగా దాడిచేసి హతమార్చిన దుండగులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. 'ఇది అత్యంత హేయమైన చర్య. మానవత్వానికే మాయని మచ్చ. దేశం యావత్తు ఈ దాడిని ఖండిస్తోంది' అని అచ్చెన్న తెలిపారు. సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, మెండ దాసునాయుడు, మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, పాండ్రంకి శంకర్, రెడ్డి గిరిజాశంకర్, ఎస్వీ రమణమాదిగ, విభూది సూరిబాబు, ఉంగటి వెంకటరమణ, కవ్వాడి సుశీల, స్వచ్ఛంద సంస్థలు, కూటమి నేతలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతాలు

జి.సిగడాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చెట్టుపొదిలాంలో బుధవారం షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యసాయి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షికోత్సవాలు ముగింపులో భాగంగా బాబాకు అభిషేకం, చందనోత్సవం, కాకడ హారతి, సుప్రభాతంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. బాబాను దర్శించుకునేందుకు గ్రామ, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

శిలాఫలకమే మిగిలింది

- సాగునీటికి రైతుల ఎదురుచూపు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

గార, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అంబళ్లవలస వద్ద నిర్మించనున్న ఎత్తిపోతల పథకం 2019లో వేసిన శిలాఫలకం అలాగే ఉంది. ఈ పథకం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదు. ఈ ప్రాంత రైతులు సాగునీటికి ఏటా పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు రూ.3.97 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 1160 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2019 ఫిబ్రవరి 13న అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి భూమి పూజ చేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఫలితంగా ఆయకట్టు రైతుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం దీని ఏర్పాటును ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో దిష్టిబొమ్మలా శిలాఫలకం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం అయినా ఈ పథకం పనులు పూర్తి చేస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం పనులు విషయమై ఎమ్మెల్యే గొం డు శంకర్ ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇక్కడ పనులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయి లో సాగునీరు అందించాలని ప్రభుత్వం దృష్టికి, సంబం ధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ పనుల కు శిలాఫలకం వేసి ఆరేళ్లు పూర్తికావడంతో ఇందుకు సంబంధించిన రీవాల్యుయేషన్‌కు సంబంధిత అధికారు లు చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది. ఏపీఎస్ఐడీసీ ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఎండీ ఆదేశాలు మేరకు దీనికి సంబంధించిన రీవాల్యుయేషన్ కోసం ఆ శాఖ అధికా రులు చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది. ఈ రీవా ల్యుయేషన్ (హైడ్రాలిక్ క్లియరెన్స్) పనులు పూర్త యితే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ప్రారంభించడం జరుగుతుంది. ఈ పనులన్నీ పూర్తి చేసి వీలున్నంత తొందరలో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఇందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక కృషి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రీవాల్యుయేషన్‌కు చర్యలు

రీవాల్యుయేషన్ పై చర్యలు ఈ ఎత్తిపోతల పథకం కోసం ఆరేళ్లు పూర్తపోయినందున మళ్లీ రీవాల్యుయేషన్ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. మా శాఖ ఎమ్‌డీ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ జరుగుతోంది.

- కామరాజు, డీఈఈ, ఏపీఎస్ఐడీసీ



అంబళ్లవలస వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి 2019లో వేసిన శిలాఫలకం

పనితీరు మారకుంటే ఉపేక్షించేది లేదు

- ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పనితీరు మారకపోతే ఉపేక్షించేది లేదని పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమీక్ష నిర్వహించిన పలు శాఖల అధికారుల తీరుపై ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు అమలులో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని, ఇకపై అలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తొలుత ఎంపీడీవో బీవీ ప్రసాదరావు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు షలంత్రి, ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీ సభ్యులు మధ్య వా గ్వాదం చోటుచేసుకుని కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు సరుబుజ్జిలి గ్రామ సచివాలయ భవనంలో మహిళకు ప్రభుత్వం వంద కుట్టుమి షన్లు అందించడంతో శిక్షణ కార్యక్రమా న్ని, స్థానిక పీహెచ్‌సీ సమీపంలో కొత్త గా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సీమీక్షలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్, ప్రత్యేకాహ్వా నితుడు కేవీజీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ రామారావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

మార్కులు తగ్గాయని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

శ్రీకాకుళం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆశించిన మార్కులు కంటే తగ్గాయన్న కారణంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీకాకుళం నగరం బలగ ప్రాంతానికి చెందిన గురుగుబెల్లి వేణుగోపాలరావు(15)కు 393 మార్కులు వచ్చాయి. మార్కులు తగ్గాయని మనస్థాపం చెందాడు. ఇంటిల్లో ఫ్యాన్‌కు ఉరివేసుకు ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. తీరా రిజల్ట్ రాగానే నిరాశకు గురై కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేశాడు. వేణుగోపాలరావు అక్క ఇంజనీరింగ్ చదువుతోంది. తండ్రి వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగి. ఈ ఘటనతో బలగ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చీటింగ్ కేసులో ఆస్తులు అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలం ఎస్ఎం పురం గ్రామానికి చెందిన మడ్డి నాగేశ్వరరావుపై 2021లో నమోదైన చీటింగ్ కేసులో చర, స్థిర ఆస్తులను అటాచ్ చేస్తూ రాష్ట్ర హోం డిపార్ట్‌మెంట్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగేశ్వరరావు ఎచ్చెర్లలో ఓ షాపును అద్దెకు తీసుకుని ప్రైజ్ చిట్స్ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ను ప్రారంభించి డబ్బులు వసూలు చేశాడు. దీనికి ఆన్‌లైన్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో యాప్‌ను సృష్టించి ప్రజలకు ఆశ చూపించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. తిరిగి చెల్లింపుల విషయంలో లబ్ధిదారులకు జాప్యం జరగడంతో ఆయన చేసిన మోసం బయటపడింది. దీంతో నాగేశ్వరరావు షాపును మూసేసి పరారయ్యాడు. లబ్ధిదారులు మోసపోయామని గుర్తించి లబోదిబోమంటూ ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు అప్పట్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు చెందిన చర, స్థిర ఆస్తులను అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం 1వ తరగతిలో ఉచిత అడ్మిషన్లకు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైనలో నమోదు చేసుకున్న దరఖాస్తు ప్రింట్‌తో పాటు అర్హత ధ్రువపత్రాలను ఎంఈవో కార్యాలయంలో అందించాలన్నారు. 5 ఏళ్లు నిండిన బీపీఎల్ రైస్‌కార్డు కలిగిన పేద విద్యార్థులు అర్హులన్నారు.

సూర్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ



గుప్త | జాహ్నవి | లహరి | గాయత్రి

రణస్థలం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సూర్య స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారు. బీవీఆర్‌జీపీ గుప్త (591), ఎం.జాహ్నవి (589), ఎం.లహరి (586), పి.గాయత్రి (586) సాధించారు.

మదర్‌థెరిసా విద్యార్థులు..

పలాస, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో శివాజీనగర్ మదర్‌థెరిసా విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెం ట్ వజ్జ భవాని తెలిపారు. కె.భవ్య 592 మార్కులు సాధించినట్లు తెలి పారు. 26 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శతశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను సంస్థ డైరెక్టర్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూ రావు, కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని ఆమెను అభినందించారు.



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, కరస్పాండెంట్ భవాని

స్ఫూర్తివంతంగా మేడే నిర్వహిద్దాం

ఆమదాలవలస, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను స్ఫూర్తివంతంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగమణి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సీఐటీయూ మండల స్థాయి విస్తృత సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ధరల పెరగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ పి.లతాదేవి, నాయకులు సంతోష్, రమణ, జి.భారతి, మీనాక్షి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి నివాళి

గార, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ గొండు నర్సింగరావు నాలుగో వర్ధంతి బుధవారం అంపోలులో ఆయన ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు, స్థానిక పెద్దలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చల్లపేట, శ్రీకూర్మం కూడలి వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంపోలులో నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

విద్యాభివృద్ధిపై దృష్టి

కవిటి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్ర త్యేక దృష్టి సారించిందని సానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు అన్నారు. బుధవారం కవిటి కళాశాలలో విద్యా ర్థులకు తరగతి పుస్తకాలు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే విద్యార్థులకు అవసరమైనవి సమకూరు స్తుందని టీడీపీ నేత బి.రమేష్ అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసి క్రమశిక్షణను అలవ ర్చుకొని జీవితాన్ని ఉన్నతం గా తీర్చిదిద్దుకోవాలన్నారు. నేతలు ఎ.మదు, బి.సురేష్, ఎ.రాజు, జి.రామారావు, ఎ.కృష్ణారావు, టి.మోహనరావు పాల్గొన్నారు.

- ఆమదాలవలస: పురపాలక సంఘంలోని రెండో వార్డు కృష్ణాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రి విద్యా కమిటీ చైర్మన్ అంపోలు యశోదమ్మ పంపిణీ చేశారు. బుధవారం పాఠ శాల పనిదినాల చివరి రోజు కావడంతో విద్యార్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. విద్యార్థులు పలు సినీ గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

జి.సిగడాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎర్రా శారద అన్నారు. బుధవారం ఆనందపురం, సంతవురిటి, మర్రివలస తదితర గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. భూసార పరీక్షలు వల్ల పొలాల్లో తేమ శాతం గుర్తించి ఎటువంటి పంట వేస్తే దిగుబడితో పాటు లాభదాయకంగా ఉంటుందో ముందుగా అంచనా వేసుకొనేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఈ పంట పొలాలకు వెళ్లి మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు అలుగోలు లక్ష్మీనారాయణ, తలచింతల కుసుమ, ముంతా హేమంత్ కుమార్, సింహాద్రి హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కవిటి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల సానుకూలంగా ఉండాలని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. కవిటిలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద దివ్యాంగులకు బుధవారం ఉపకరణాలను పంపిణీ చేశారు. దివ్యాంగులకు సమగ్రశిక్ష ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు, ఐటీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ గ్రామంలో జరుగుతున్న పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీరామతారక మహో మంత్రం యజ్ఞం ఐదో రోజు వేడుకగా జరిగింది. త్రిదండి చిన్న జియర్ స్వామి ప్రవనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం స్వామి వారి శ్రీహస్తముల మీదుగా తీర్థగోష్టి జరిగింది.

ప్రభుత్వ విద్య మెరుగైనది

కవిటి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్య ఎంతో మెరుగైనదని హెచ్ఎం పి.జ్యోతి అన్నారు. మడియారపుట్టుగలో బుధవారం ప్రాథమికోన్నత పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందుకోవాలన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ కార్డ్‌ను అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నర్తు సుజాత, ఉపాధ్యాయులు వెంకటేష్, సీతంనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేత నదియా

కవిటి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో మహిళా విభాగం నుంచి కవిటికి చెందిన పి.నదియా ప్రథమ స్థానంలో నిలిచినట్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.జైరాం తెలిపారు. కవిటిలోని ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసిన నదియా విద్యాభ్యాసం చేస్తూనే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నదియాను ఉషోదయ యువజన సంఘం, ఇండోర్ స్టేడియం క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జి.సిగడాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో గల ఆయుష్ మందిర్ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా వడ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రజలకు తగు జాగ్రత్తలతో పాటు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి రోగుల పరిస్థితులపై ఆరా తీయాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. లక్ష్మీనర్సుపేట కేజీబీవీ జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాజకీయ అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. కేజీబీవీలోని విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం లేకుం డా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రభుత్వం అమలు చేసే మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటఅంబిక, టీడీపీ నాయకులు ఎం.మనోహర్ నాయుడు, వి.గోవింద రావు, కె.కృష్ణమాచారి, కె.చిరంజీవి, వి.ఆనందరావు, ఎస్. తేజేశ్వరరావు, టి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.లక్ష వితరణ


ఎంఈవోకి లక్ష చెక్కును అందజేస్తున్న శిమ్మ భాగ్యలక్ష్మి

నరసన్నపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కిల్లాం పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన శిమ్మ భాగలక్ష్మి రూ.లక్ష వితరణ చేశారు. బుధవారం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఎంఈవో ఉప్పాడ శాంతారావుకు ఈ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు రువ్వ బోడి రామన్న, ఉప సర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో కంప్యూటర్లు..

హిరమండలం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కంప్యూటర్లను బహూకరించారు. బుధవారం ఎంఈవో కె.రాంబాబు, హెచ్ఎం టి.కేశవ రావుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు సాంకేంతిక విద్యను అందించేందుకు తమ వంతుగా కంప్యూటర్లను అందజేసినట్లు చెప్పారు.

పుస్తకాలు నిజమైన నేస్తాలు


పెద్దసీదిలో విలియం షేక్‌స్పియర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు నిజమైన నేస్తాలని పలువురు వక్తలు అన్నారు. విలియం షేక్‌స్పియర్ జయంతి సందర్భంగా ఆంగ్ల భాషా, ప్రపంచ పుస్తక దినోత్సవాలను పెద్దసీది జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ పాఠశాలలోను బుధవారం నిర్వహించారు. సీది హెచ్ఎం కొల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విలియం షేక్‌స్పియర్ రచనలు ఆంగ్ల భాష సాహిత్య దీపికలని కొని యాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను అంద జేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ డీజీఎం ప్రతాప్‌రెడ్డి

కాశీబుగ్గ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలని ఎంఎస్ఎంఈ ఆంధ్రప్రదేశ్ డీజీఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీగురుకుల విద్యాలయంలో బుధవారం పలు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా శాఖ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యం లో రోబోలు, డ్రోన్స్, అధునాతన సాంకేతిక పరికరాలతో విజ్ఞానోత్సవం నిర్వహించనున్నామని, దీనిలో అనేక సాంకేతిక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. డిజిటల్ యుగంలో విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇందులో భాగంగా శ్రీ గురుకుల విద్యాలయంలో తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. బెంగ ళూరుకు చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ వాసు రోబోటిక్స్, డ్రోన్స్ కృత్రిమ మేధస్సుపై సూచనలు చేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన శాస్త్రవేత్త హర్షవర్ధన్, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రముఖ మానసిక శాస్త్ర నిపుణుడు డాక్టర్ మాకినా సతీష్, గురుకుల విద్యాలయం వ్యవస్థాపకుడు కింతల కృష్ణమూర్తి, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కె.అశోక్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

పలాసరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని బానిసలుగా చేసే కోడ్‌లపై పోరాటం సాగించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో బుధవారం మేడే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1 నుంచి 5 వరకు అన్ని కార్మిక వాడలు, పరిశ్రమల్లో జెండా ఆవిష్కరణ చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ ఏర్పాటు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాలను ఉపసంహరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పుచ్చ దుర్యోధన, మద్దిల ధర్మారావు, దాసరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు


తల్లిదండ్రులతో ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు

నందిగాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం నుంచి సెలవులను ప్రభుత్వం ప్రకటించడంతో బుధవారం నందిగాం బాలికల గురు కులం, మదనాపురం కేజీబీవీ, నందిగాం బీసీ వసతి గృహం, జయపురం, నవర లింగుపురం ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు పయనమయ్యారు.

సీఎం పర్యటనలో ఇబ్బందులు లేకుండా చూడాలి

● మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 26న ఎచ్చెర్ల నియోజకవర్గంలో పర్యటిస్తున్నందున ఎక్కడ ఎలాం టి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిమ్మా డ క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడు దల చేశారు. ప్రభుత్వం మత్స్యకార భరోసా పథ కాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నందున నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ చిన్న విషయంలో అలసత్వం, నిర్లక్ష్యం వహించేందుకు వీల్లేదన్నారు. సభా వేదిక వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవా లని, భద్రతా బలగాలు అణువణువూ గాలించి ఏ చిన్న అనుమానం వచ్చినా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సీఎం పర్యటనకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రొటోకాల్ నిబంధన లను పాటిస్తూ జిల్లా ప్రజా ప్రతినిధులను పోలీసులు సభా ప్రాంగణంలో రిసీవ్ చేసుకోవాలని సూచించారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లెనిద్ర': ఎంజీఆర్

హిరమండలం, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం మర్రిగూడ గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఆశ్రమ పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉయ్యక సురేష్, వైస్ ఎంపీపీ వైకుంఠరావు, పలువురు గ్రామస్థులు గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మండల కేంద్రంలో గిరిజన భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీడీఏ ఏర్పాటు చేస్తే అధికారులకు సమస్యలు తెలియజేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని చెప్పారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాదరావు, తహసీల్దార్ హనుమంతరావు, టీడీపీ మండల నేతలు యాళ్ల నాగేశ్వరరావు, టి.తిరుపతిరావు, నందిగాం సాయి కృష్ణ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో యాత్రీకులపై జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే ఎంజీఆర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఉగ్ర దాడికి వ్యతిరేకంగా
కొవ్వొత్తుల ప్రదర్శన

జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం రాత్రి కొవ్వొత్తులు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. ఉగ్ర దాడుల్లో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: కొవ్వొత్తులు పట్టుకుని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు



గుజరాతీపేట: నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, మాజీ సైనికులు



గుజరాతీపేట: అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో..


ఇచ్ఛాపురం: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు



అరసవల్లి: కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు

పూడిలంక రహదారి నిర్మాణానికి చర్యలు

● రూ.4 కోట్లతో ప్రతిపాదన

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పూడి జగన్నాథపురం పంచాయతీ పరిధి పూడిలంక రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఈ పర్యాయం రోడ్డు నిర్మాణం పూర్తయి గ్రామానికి రాకపోకలకు అనువుగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏటా ఏమాత్రం వర్షం కురిసినా ఉప్పుటేరు ఉధృతికి పూడిలంక గ్రామానికి రోజుల తరబడి రాకపో కలు నిలిచిపోతుం టాయి. ఇది ఏటా కనిపించే దృశ్యమే. గ్రామానికి వెళ్లేందుకు గతంలో వేసిన కాలినడక దారి నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. 2014లో టీడీపీ ప్రభుత్వం పల్లి వూరు జంక్షన్ నుంచి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే పూర్తి స్థాయి రోడ్డు నిర్మాణానికి నిధులు చాలక పోవడం, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాలి. ప్రస్తుతం పూడిలంక వాసులకు ఈ రహదారి గుండా కొంతమేర ప్రయాణించి మిగిలిన దూరం పడవ సాయంతో గ్రామానికి చేరుకుంటున్నారు. ఏటా వరదలు, వర్షాల సమయంలో ఈ రోడ్డు నిర్మాణంపై నేతలు, అధికారులు హామీలిస్తున్నా నెరవేరక పోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రహదారి నిర్మాణానికి అవసర మైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించడంతో పంచాయతీరాజ్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేశామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని పీఆర్ ఏఈ నాగభూషణ్ తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.


ఉప్పుటేరు ధాటికి కొట్టుకుపోయిన నడకదారి (ఫైల్)

న్యూస్ బాక్స్

మట్టి నమూనాల సేకరణ

కోటబొమ్మాళి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భూముల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. బుధవారం నిమ్మాడలో మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

మందిరానికి రూ.లక్ష వితరణ

హిరమండలం,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హిరమండలం దేవరశెట్టి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సత్యసాయి మందిర నిర్మాణానికి ప్రైవేటు ఫిల్లింగ్ స్టేషన్ యజమాని అంధవరపు శివకుమార్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని కమిటీ అధ్యక్షుడు అంధవరపు అబ్బాయికి అందించారు. సెక్రటరీ ఎ.బుచ్చుబ్బాయి, ఎ.సంతోష్‌కమార్ పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో నేల సారవంతం

నందిగాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి లోకేష్, ఎంటీ మాధవి అన్నారు. బుధవారం శివరాంపురంలో మహిళా సంఘాలకు నవధాన్యాల విత్తన తయారీపై అవగాహన కలిగించి తయారు చేయించారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

నిరుపయోగంగా కియోస్క్‌లు

హిరమండలం, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించేందుకు గాను వైసీపీ ప్రభుత్వం అప్పటి రైతుభరోసా కేంద్రాలకు కియోస్క్‌లు సరఫరా చేసింది. నాడు-నేడు పనులు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, గ్రామ వార్డు సచివాలయాల పేరుతో హడావుడి చేయడం తప్ప చేసిందేమీ లేదు. ముఖ్యంగా కియోస్క్ యంత్రాల ఏర్పాటుకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ఒక్కో యంత్రానికి రూ.78 వేలు, టీవీకి రూ.45 వేలు చొప్పున వెచ్చించారు. రాయితీపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొను గోలుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. కానీ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించక పోవడంతో సిబ్బంది సెల్ ఫోన్‌ల ద్వారా కొన్నా ళ్లు వినియోగించారు. ఆ తరువాత వాటిని మూలకు చేర్చారు. దీంతో ఈ యంత్రాలు నిరుపయోగంగా తయారయ్యాయి.


గులుమూరు సచివాలయంలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పోలాకి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగు తున్న కార్యక్రమాల్లో భాగంగా చివరిరోజు ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను ప్రతి ష్ఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో స్థలదాత ఎస్.తారకేశ్వరరావు, గ్రామపెద్దలు, యువజన సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రామమందిరంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు


నివగాం వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులు

ప్రధాన రహదారి గోతులమయం

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● ప్రమాదాల బారిన వాహనదారులు

కొత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల కేంద్రం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద, ఇటు పాలకొండ-నివగాం మార్గంలో గౌడివీధి వద్ద రోడ్డు దారుణంగా తయారైంది. గోతులు ఏర్పడి నీరు చేరడంతో వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. నివగాం మార్గం గుండా ఒడిశాకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డుపై గోతులు ఉండడంతో వాహనాలు పాడవుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డంతా గోతులతో నిండడం దీనికి తోడుగా వరద నీటి కాలువ ఖానా ఆక్రమణలకు గురి కావడం తో ఏమాత్రం వర్షం కురిసినా మురుగు నీరు, వర్షపునీరు గోతుల్లో చేరి మరింత దారుణంగా తయారవుతున్నాయి. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు పలువురు వాహనదారులు కోరుతున్నారు.


కొత్తూరు బ్యాంకు వద్ద ఇలా..

నేడు అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెంటూరులోని నీలమణిదుర్గ, చింతపోలమ్మ అమ్మవార్ల ఆలయ ఏడో వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితుడు రేజేటి బోసుబాబు, సహాయకుడు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేషపూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

గొట్టాబ్యారేజీ డీఈఈగా సరస్వతి


డీఈఈ సరస్వతిని అభినందిస్తున్న సిబ్బంది

హిరమండలం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీకి రెగ్యులర్ డీఈఈని నాలుగేళ్ల తరువాత నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రభాకర్ నాలుగేళ్ల కిందట బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఇన్‌చార్జిలతోనే నిర్వహించారు. ఎట్టకేలకు డీఈఈగా సరస్వతిని నియమించారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి అభినందించారు.

ఆకట్టుకున్న డ్యాన్స్ ప్రదర్శన


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చినబోకులపాడు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని స్వర్ణలత, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, రెయ్య బాలకృష్ణ, రెయ్య గణపతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



హిరమండలం: ట్రై సైకిళ్లతో దివ్యాంగులు, అధికారులు

హిరమండలం/ఎల్ఎన్‌పేట/హరిపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఉపకరణాలను పంపిణీ చేశారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, మందస భవిత కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, సీపీ చైర్లు అందించారు. దివ్యాంగుల్లో మానసిక స్థైర్యం కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు రాంబాబు, సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి, మర్రిపాటి లక్ష్మణరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట: దివ్యాంగులకు అందజేసిన పరికరాలతో విద్యాశాఖాధికారులు